క్లుప్తంగా

ఆక్వా హబ్ స్థలం పరిశీలన

కాట్రేనికోన: కాట్రేనికోన మండలం వేట్లపాలెంలో మత్స్యశాఖ నిధులతో ఏర్పాటు చేయబోతున్న ఆక్వా హబ్ స్థలాన్ని మత్స్యశాఖ జేడీ షేక్ లాల్ మహ్మద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీతో సుమారు రూ.1.25 కోట్లతో ఆక్వా హబ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాణ్యమైన మత్స్య ఉత్పత్తులు రొయ్యలు, చేపలు, ప్రోసెసింగ్ ఎండు చేపలు ప్యాకింగ్‌తో అందించేందుకు ప్రభుత్వం ఆక్వా హబ్‌లను చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, స్థానిక నాయకులు ఉన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగు


ముసలయ్య(ఫైల్)

తాళ్లరేవు: నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన వారమవుతామని సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ అన్నారు. గురువారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన రేషన్ డీలర్ యడ్ల ముసలయ్య(90) మృతి చెందారు. ఈ నేపథ్యంలో ముసలయ్య కుటుంబసభ్యులతో మాట్లాడి అతని కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ.బ్యాంకు వారికి అందజేశారు. ఐ బ్యాంకు టెక్నీషియన్ రవి కార్నియాలను సేకరించారు. అంతటి విషాద సమయంలోనూ నేత్రదానం చేసేందుకు అంగీకరించిన కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

ప్రధాన కార్యదర్శికి సత్కారం

అమలాపురం టౌన్: ది అసోసియేషన్ అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన యెండూరి నాగేశ్వరరావును స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో పట్టణ వైశ్య సంఘం సభ్యులు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షుడు వై.వెంకట్రామయ్య, వంకాయల కాశీ, నంబూరి సత్యనారాయణమూర్తి, వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంకు సీఎస్పీ సెంటర్ ప్రారంభం


సీఎస్పీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్టేట్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్

కాట్రేనికోన: గ్రామీణ ప్రాంతంలో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంకు సిద్ధంగా ఉందని ఎస్‌బీఐ మేనేజర్ వై.వెంకటేష్ అన్నారు. పల్లంకుర్రులో నూతనంగా ఏర్పాటు చేసిన ఖాతాదారుల సేవా కేంద్రాన్ని(సీఎస్పీ సెంటర్) ఆయన ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అద్దేపల్లి వినోద్, ప్రసాద్, గోనేమడతల బ్రహ్మాజీ, కంచెర్ల వేణు, శ్రీనివాస్, సిద్ధూ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో మానసిక ఆరోగ్య శిబిరం


మానసిక ఆరోగ్య వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎస్పీ రెడ్డి

తాళ్లరేవు: మానసిక రుగ్మతతో బాధపడే వారికి వైద్యసేవలు అందించేందుకు గురువారం తాళ్లరేవులో మానసిక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక సీహెచ్‌సీలో ఉమా మనోవికాస కేంద్రం, కెరీర్స్ వరల్డ్ వైడ్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, మానసిక వైద్యుడు కాటన్‌లు పాల్గొని పలు సూచనలు చేశారు. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న సుమారు 40 మందిని పరీక్షించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూఎంఐ ప్రాజెక్టు కోఆర్డినేటర్ అనూష, కమ్యూనిటీ మొబలైజర్స్ సీత, నాగమల్లి, మధుకుమార్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడికి సత్కారం


బాబురావును సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కనపాల బాబురావును పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు అభినందించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు మొసలి స్వర్ణన్ రాజు, మామిడికుదురు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు యార్లగడ్డ పరంజ్యోతి, పవర్ ఆఫ్ ఫెయిత్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు జోసెఫ్ తాతపూడిలు జగ్గన్నపేటలో బాబురావు స్వగృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు.

జీవ వైవిధ్యానికి నవ వైద్యం

- 31 రకాల విత్తనాలతో సారవంతమైన భూమి
- అధిక దిగుబడులకు ఆస్కారం
- పుష్కలంగా పశువులకు పచ్చగడ్డి


నవధాన్యాలు వేసిన వరి క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అల్లవరం: నిస్సారమైన భూమిని సారవంతమైన భూమిగా మార్చి తద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ విభాగం కార్యాచరణ చేపట్టింది. నేలలో తరచుగా వివిధ రకాల పంటను వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియ దున్నడంతో సారవంతమైన భూమి అందుబాటులోకి వస్తుంది. 31 రకాల విత్తనాలను వ్యవసాయ క్షేత్రాల్లో వెదజల్లడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా జీవ వైవిధ్యం ఏర్పడుతుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నేల సారవంతమవుతుంది

నవధాన్యాలను నేలలో వెదజల్లడం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరగటానికి ఆస్కారం ఉంటుంది. పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు, సుగంధ ద్రవ్యాలు, ఆకు కూరలు, కూరగాయలు, తీగ, నూనె గింజలను నేలలో విత్తడం ద్వారా భూమిలోకి 8 మీట్లర లోతు వరకు వేరు వ్యవస్థ ఏర్పచుకుని భూమిలోని సూక్ష్మజీవులకు ఆశ్రయం కల్పిస్తుంది. తద్వారా ప్రధాన పంటకు


భూసారాన్ని పెంచేందుకు 31 రకాల విత్తనాలు

కావలసిన అన్ని పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. నవధాన్యాలు వేసిన 15 రోజుల నుంచి 30 రోజుల మధ్యలో ఏపుగా పెరిగిన పచ్చిరొట్టని ట్రాక్టర్ సహాయంతో నేలలో కలిపి దున్నడంతో నేల సారవంతమవుతుంది. పచ్చి రొట్టలు పెంచిన నేలలో చీడ పీడలు నుంచి ప్రధాన పంట తట్టుకుంటుంది. వివిధ రకాల విత్తనాలు నేలలో విత్తడం వల్ల నేల గుల్లబారి వాన పాములు వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా నేలలో తేమ శాతం పెరుగుతుంది. పచ్చిరొట్ట పుష్కలంగా లభించి పశువులకు ఆహార కొరత తీరుతుంది.

అధిక దిగుబడులకు ఆస్కారం



31 రకాలు విత్తనాలు విత్తడం ద్వారా నేల సారవంతంగా తయారు అవుతుంది. ప్రధాన పంటలో అధిక దిగుబడులు సాధించడానికి అస్కారం ఏర్పడుతుంది. అందుకే నవధాన్యాలు వేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎకరానికి 10 కేజీల విత్తనాల చొప్పున వేయాల్సి ఉంటుంది.

– బి.దేవి, జిల్లా మార్కెటింగ్ ఇన్‌చార్జ్, ప్రకృతి వ్యవసాయ విభాగం

ఐదేళ్లుగా నవధాన్యాలు వేస్తున్నాం



అధికారుల సలహాలు, సూచనలతో ఖరీఫ్, దాళ్వా సీజన్ మధ్య కాలంలో నవధాన్యాలను వరి, కొబ్బరితోటలో వేస్తున్నాం. దాళ్వా పంట ముగిసిన తర్వాత కూడా నవధాన్యాలు వేసి పచ్చి రొట్టని భూమిలో కలియ దున్నుతున్నాం. ఐదేళ్లుగా నవధాన్యాలు క్రమం తప్పకుండా వేస్తూ భూసారాన్ని పెంచుతున్నాం. పశువులకు పచ్చి గడ్డి పుష్కలంగా ఉంటుంది.

– పాటి సింహాద్రి, రైతు, కోడూరుపాడు

టైలర్ల సొసైటీలకు గుర్తింపు ఇవ్వాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని టైలర్ల సొసైటీలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చి నిధులు కేటాయించాలని జిల్లా బాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ముగ్గళ్ల మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అమలాపురంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ తదితర జిల్లా స్థాయి అధికారులను గురువారం వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దొంగ సత్యనారాయణమూర్తి, మహిళా అధ్యక్షురాలు మాధవరపు కనకదుర్గ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కంశెట్టి స్వామి, జిల్లా అధికార ప్రతినిధి వేమగిరి శ్యామ్ పాల్గొన్నారు.


డీఆర్వో సత్తిబాబుకు వినతి పత్రం అందిస్తున్న మురళీకృష్ణ తదితరులు

తపాలా ఉద్యోగుల ధర్నా

అమలాపురం టౌన్: స్థానిక డివిజన్ పోస్టల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల సాధన కోసం గ్రామీణ తపాలా ఉద్యోగుల గురువారం ధర్నా చేశారు. ధర్నాకు గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జేఏసీ చైర్మన్ వీవీ మహాలక్ష్మి, కన్వీనర్ జీఎస్ రాయులు నాయకత్వం వహించారు. తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వీవీ రామకృష్ణ మాట్లాడుతూ ఒక్కో ఉద్యోగికి అదనంగా ఇద్దరి ఉద్యోగల బాధ్యతలు అప్పగించడం బాధాకరమన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి ఆర్.రమేష్, బ్రాంచి కార్యదర్శి రాజు, బోనం శ్రీను, జి.భీమార్జునరావు ధర్నాలో పాల్గొన్నారు.


పోస్టల్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు

రైల్వే లైన్ నిర్మాణానికి కృషి

ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే లైన్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద కోనసీమ రైల్వే సాధన సమితి(కేఆర్ఎస్ఎస్) ప్రతినిధుల బృందం ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును గురువారం కలిసి సత్కరించారు. ఇంతకాలం కేఆర్ఎస్ఎస్ ప్రతినిధిగా ఉన్న సూర్యనారాయణరావు చట్టసభలో అడుగుపెడుతున్న నేపథ్యంలో కోనసీమ రైల్వే ప్రాజెక్ట్ పనులు వేగం పుంజుకునేలా కృషి చేస్తారని సమితి ప్రతినిధులు ఆకాంక్షించారు. రైల్వేలైన్ నిర్మాణానికి తన వంతు కృషి ఉంటుందని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, సమితి నాయకులు కల్వకొలను తాతాజీ, సప్పా నాగేశ్వరరావు, ఆర్వీ నాయుడు, ఎర్రమిల్లి పాండు రంగారావు, బీఎస్ మూర్తి, వంకాయల రాజా తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరిస్తున్న కేఆర్ఎస్ఎస్ ప్రతినిధుల బృందం

ప్లాంట్ పెట్టొద్దని వినతి

యానాం: తమ ప్రాంతంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మించొద్దని గురువారం గోపాల్‌నగర్ తదితర గ్రామాల నివాసితులు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మురుగునీటి వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను నిర్మించనున్నారని తెలిసిందని, తమ ప్రాంతంలో విద్యా సంస్థలు, నివాసాలు అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్లాంట్‌ను నెలకొల్పితే ప్రజలకు సమస్యలు తలెత్తుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మల్లాడి శామ్యూల్, వేగేశ్న భాస్కరరాజు పాల్గొన్నారు.


ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో నిత్యాన్నదానం ట్రస్టుకు పినిశెట్టి నాగేశ్వరరావు, నాగదుర్గ దంపతులు (హైదరాబాద్) గురువారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు ఈ విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్ పాల్గొన్నారు.

6న హుండీల లెక్కింపు

శ్రీ బాలబాలాజీ స్వామి వారి హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం జరుగుతుందని ఈఓ నాగవరప్రసాద్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రజాప్రతినిధులు, ట్రస్టు బోర్డు సమక్షంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వీఆర్ఓపై కేసు

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామ సచివాలయం -1 వీఆర్ఓ పసుపులేటి సత్యధనలక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 25న సచివాలయంలో జలజీవన్ మిషన్ సమావేశం జరిగింది. ఆ సందర్భంగా ఓ స్థలం విషయమై వీఆర్ఓను ఉప సర్పంచ్ బొంతు శ్రీను, వార్డు సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రశ్నించారు. దీనికి వివరణ ఇవ్వకపోగా ఆమె తమను నానా దుర్భాషలూ ఆడిందని, రెవెన్యూ సంఘంలో పెట్టి తమ అంతు చూస్తామంటూ బెదిరించారని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమ తవ్వకాల నిలిపివేత

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానాం గ్రామంలో అనుమతులు లేకుండా తవ్వుతున్న ఆక్వా చెరువుల త్వవకాలను మత్స్యశాఖ జేడీ షేక్ లాల్‌మహ్మద్ గురువారం నిలిపేశారు. అనుమతులు లేకుండా ఎవరైనా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, డీటీ జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణ

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకూ ప్రతి తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన మొత్తం 39 మంది విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పితాని వీర వెంకట సత్యనారాయణ ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. తెలుగు డిక్షనరీ, తెలుగు గ్రామర్, వ్యాసావళి, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా యోగాసనాలు, ఆరోగ్య సూత్రాల గురించి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంగా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యత


విద్యార్థులతో నిర్వహిస్తున్న ర్యాలీ

యానాం: సమాజంలో ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యతని పలువురు వక్తలన్నారు.గురువారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో బేటీ బచావో బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను చదివించండి) కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సత్తెప్పనాయుడు మాట్లాడుతూ గర్భంలో ఉండగానే ఆడపిల్లపై చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలపై వివక్ష విడనాడి వారికి నాణ్యమైన విద్యను అందించాలని, ఆడపిల్ల ఇంటికి మహాలక్ష్మిగా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాన్ మసాలా, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

యానాం: యానాం పట్టణ పరిధిలో ఒక కిళ్లీ షాపులో నిషేధిత పాన్ మసాలా, గుట్కా ప్యాకెట్లను గురువారం పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక టూరిస్ట్ హోమ్ ఎదురుగా ఉన్న కిళ్లీ షాపులో నిల్వ ఉంచి అమ్ముతున్న 3,271 పాన్, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంప్రదాయబద్ధంగా వృద్ధ గోమాత ఖననం

అమలాపురం టౌన్: గోవుల సగటు ఆయుర్దాయం 14 నుంచి 16 సంవత్సరాలు. అయితే అమలాపురంలోని గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాలలో ఓ ఆవు 22 ఏళ్లు జీవించి వృద్ధాప్యంతో గురువారం మృతి చెందింది. గోశాలలో పెద్దమ్మగా పిలిచే ఈ వృద్ధ గోమాతను సంప్రదాయబద్ధంగా ఖననం చేశారు. ఆవు 22 సంవత్సరాలు జీవించడమంటే అరుదైన విషయమని పశు సంవర్ధక శాఖ కొత్తపేట ఏడీఏ డాక్టర్ చీకట్ల వెంకటరమణ చెప్పారు.

వ్యవసాయ ఉత్పత్తుల సొసైటీలకు ఆర్థిక సాయం

యానాం బ్లాక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ లిమిటెడ్ ఏర్పాటు

యానాం: రైతులు పండించిన పంటల ఉత్పత్తులకు మంచి ధర కల్పించేందుకు అగ్రికల్చర్ ఫార్మర్స్, ప్రొడ్యూసర్స్ సొసైటీలను ఏర్పాటుచేసి ఆర్థిక సాయం అందిస్తున్నట్లుగా ఎన్‌సీడీసీ అసిస్టెంట్ డైరెక్టర్ జయరామచంద్రన్ తెలిపారు. గురువారం స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో పలువురు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం బ్లాక్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ లిమిటెడ్‌ను నూతనంగా ఏర్పాటుచేశారు. ఈ సొసైటీకి నూతన చైర్మన్‌గా మాజేటి సత్యభాస్కర్, వైస్‌చైర్మన్‌గా కోన వెంకట్రావులను ఎన్నుకున్నారు. అనంతరం జయరామచంద్రన్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటల ఉత్పత్తులకు మంచి ఆదాయాన్ని సమకూర్చుకోవడం, ఉత్పత్తుల రవాణా, మార్కెటింగ్, కోల్డ్‌స్టోరేజీల ఏర్పాటు, పెట్టుబడులు తదితర అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి సీబీబీఓ సింగారవేలు, డీడీ గణేషన్, వ్యవసాయ అధికారి జోగిరాజు, రైతులు మొలగజ్జెల ఆనందరావు, మాగాపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నూతన సొసైటీ చైర్మన్ సత్యభాస్కర్

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌కు సత్కారం

అల్లవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌ని మండల శెట్టిబలిజ సంఘ సభ్యులు గురువారం సత్కరించారు. అల్లవరం హైస్కూల్ సెంటర్లో మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఇజ్రాయిల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం శాలువాలతో ఇజ్రాయిల్‌ని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొక్కా శ్రీను, బీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు దొమ్మేటి రామకృష్ణ, దొమ్మేటి విష్ణుమూర్తి, రమణాతి నాగేశ్వరరావు, పితాని శేఖర్, బొక్కా ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


ఇజ్రాయిల్‌ని సత్కరించిన బీసీ సంఘ సభ్యులు

వేసవిలో తాగునీటికి ఆటంకం లేకుండా చూడాలి

ఉప్పలగుప్తం: రక్షిత మంచినీటి ప్రాజెక్టల ద్వారా వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయశాఖ ఏడీ ఎంఏ షంషి అన్నారు. మండలంలోని చల్లపల్లిలో ఉన్న రక్షిత మంచినీటి ప్రాజెక్టను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్లపల్లి మంచినీటి ప్రాజెక్ట్ ద్వారా మండలంలోని 12 గ్రామాలకు నీటి సరఫరా అందిస్తున్నామన్నారు. కాలువల కట్టుబడి అనంతరం ప్రాజెక్ట్‌లో నీరు తగ్గినా తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉప్పలగుప్తం, ఎస్.కొత్తపల్లి, ఎస్.యానాం గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ఓహెచ్‌ఆర్‌లను, సంపులను షంషి పరిశీలించారు.


చల్లపల్లిలో తాగునీటి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న షంషి

అంబులెన్స్‌లకు మరమ్మతులు చేయించాలి

యానాం: యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్లు గురువారం నూతనంగా అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పలాష్‌కుమార్ సన్యాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంబులెన్స్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జీజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న అంబులెన్స్‌లు పాతబడిన నేపథ్యంలో వాటికి మరమ్మతులు చేయించాలని, కొత్త అంబులెన్స్‌లు సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు బొక్కా వెంకటేశ్వరరావు, మాణిక్యం, మట్టపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


యానాం జీజీహెచ్ నూతన ఏడీ సన్యాల్‌ను కలిసిన అంబులెన్స్ డ్రైవర్లు

అడ్డుకట్టను మళ్లీ తొలగించారు

ఉప్పలగుప్తం: గొరగనమూడి మీడియం డ్రెయిన్‌పై సాగునీటి ఎద్దడిని నివారించడానికి ఏర్పాటుచేసిన క్రాస్‌బండ్(అడ్డుకట్ట)ను వరి చేలలో ఉప్పునీరు పోటెత్తడంతో రైతులు కొంతమేర తొలగించిన విషయం తెలిసిందే. సాగునీటిని నిల్వ చేయడానికి తిరిగి యథావిధిగా అడ్డుకట్టను ఏర్పాటుచేశారు. అయినా ఎగువన ఆక్వా చెరువుల ఉప్పు నీటిని డ్రెయిన్‌లోకి వదలటంతో ఉప్పలగుప్తం శివారు చీకట్లపాలెం, పేరాయిచెరువు ప్రాంతాల్లో వరి చేలలోకి ఉప్పునీరు చేరి సాగుకు ఆటంకం కలుగుతుంది. దీంతో రైతులు ఆ అడ్డుకట్టను గురువారం మళ్లీ కొంతమేర తొలగించారు. ఆక్వా చెరువుల నీటిని డ్రెయిన్‌లోకి వదలడంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డ్రెయిన్స్ ఏఈ కె.సునీతాదేవిని వివరణ కోరగా ఆక్వా రైతులు ఉప్పు నీటిని వదిలి వరి సాగు చేసే రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పూర్తిగా ఉప్పునీరు తగ్గాక రైతుల అవసరాన్ని బట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


గొరగనమూడి డ్రెయిన్‌పై ఏర్పాటుచేసిన అడ్డుకట్టను తొలగిస్తున్న రైతులు

13 నుంచి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్స్ ఎంపికకు సంబంధించి ఈ నెల 13న అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఐజీ చంద్రన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 253 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్‌ల నుంచి మొత్తం 14,173 దరఖాస్తులు రాగా 128 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. 26 డ్రైవర్ పోస్టులకు 881 దరఖాస్తులు రాగా నాలుగు దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులు(హాల్ టికెట్లు) పోలీస్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ పరీక్షలు పుదుచ్చేరి గోరిమేడు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ గ్రౌండ్‌లో జరుగుతాయని చెప్పారు.

దేవస్థానం కమిటీ సభ్యుల పిటిషన్ కొట్టివేత

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీని రద్దు చేస్తూ ఫిబ్రవరి 10న ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ కమిటీ సభ్యులు వేసిన పిటిషన్‌ను గురువారం మద్రాసు హైకోర్టు కొట్టి వేసింది.

బీమాతో కుటుంబానికి భరోసా

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవడం వల్ల ఆయా కుటుంబాలకు ఆర్థిక భరోసా ఉంటుందని జీవిత బీమా సంస్థ శాటిలైట్ కార్యాలయ మేనేజర్ కె.లలితకుమార్ అన్నారు. జీవిత బీమా సంస్థ ఆవశ్యకతను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ఆయన వివరించారు. పొదుపు అవసరంపై వకృత్వ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అంద జేశారు.

వైభవంగా హంస వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హంస వాహనోత్సవం వైభవంగా జరిగింది. శెట్టిబలిజ సంఘం ఉత్సవదారులుగా నిర్వహించిన వాహనోత్సవంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి తదితర అధికారులు పాల్గొని స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామల పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. జ్వరాల బారిన పడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటా సర్వే చేయాలన్నారు. సమావేశంలో వక్కలంక సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైద్యాధికారులు ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు